
### ఎస్సై సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో

## ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు



**టౌన్ రిపోర్టర్ గూడూరు పెన్ పవర్ మార్చి 21 :** గూడూరు రెండవ పట్టణం వై జంక్షన్ వద్ద ఎస్సై సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా ఆర్సి బుక్, లైసెన్స్ మరియు ఇతర ప్రమాణమైన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడం ప్రమాదకరమని, అందుకు కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఆటో డ్రైవర్లు మరియు స్థానిక ప్రజలు హాజరయ్యారు. సదస్సు ద్వారా ఆటో డ్రైవర్లలో చట్టపరమైన నిబంధనలపై అవగాహన కలిగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా యువనేత డా.పాశం జశ్వంత్ జన్మదిన వేడుకలు






**టౌన్ రిపోర్టర్ గూడూరు, పెన్ పవర్ మార్చి 21 :** తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డా.పాశం సునీల్ కుమార్ కుమారుడు యువ నేత డా.పాశం జశ్వంత్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జశ్వంత్ పుట్టిన రోజు కేకును పార్టీ యువత ఆధ్వర్యంలో కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నేతలు మాట్లాడుతూ, పాశం జశ్వంత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబానికి, తెలుగు దేశం పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం సునీల్ కుమార్ తమ్ముడు పాశం అనిల్, టిడిపి యువజన విభాగం నాయకులు వేముల సునీల్, అనిల్, ఓం ప్రకాష్, చరణ్, ప్రుధ్వి, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్మవరం టీం ఆధ్వర్యంలో ప్లాంటేషన్ మొక్కలు నాటే కార్యక్రమం



**ధర్మవరం, మార్చి 21, పెన్ పవర్ ప్రతినిధి :** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో శుక్రవారం రోజున చిన్నూరు గ్రామానికి వెళ్ళు రోడ్డు వద్ద ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు ప్లాంటేషన్ (మొక్కలు నాటు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ అడ్వకేట్ డాక్టర్. జుకూరు. సుమలత వారు మరియు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు చట్టా రవి వర్ధన్, చంద్రమౌళి, వాల్మీకి నరేష్, బొగ్గరపు జగదీష్ బాబు, ప్రభాకర్, ఫార్హన బేగం, లక్ష్మి, శ్రీదేవి, జానుతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## త్రాగు నీటికొరకు వానరాల అవస్థలు

### ఫారెస్ట్ అధికారులు స్పందించండి..


### నీటి కోసం గతంలో రోడ్లపైకి అడవి జంతువులు

### నీటి తొట్లు ఏర్పాట్లు చేయండి



**రిపోర్ట్ పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ మార్చి 21 :** కడప జిల్లా, గువ్వల చెరువు ఘాట్ రోడ్డు, రాపూరు ఘాట్ రోడ్డు , కదిరి ఘాట్ రోడ్డులతో పాటు కడప రేణిగుంట హైవేలపై త్రాగు నీటి కొరకు, ఆహరం వానరాలు (కోతులు) వాహన దారులు తమ దాహర్తి తీరుస్తారేమోనని ఎదురు చూస్తున్నాయి. దయచేసి సమీపంలో ఉన్న దయార్ద్ర హృదయులు మూగ జీవాలకు నీటి తొట్టెలు ఏర్పాటు చేసి ఈ ఎండల కాలంలో నోరులేని జీవాలను ఆదుకోగలరు.

## పేరం సోదరులను అభినందించిన దేవస్థాన ఈవో గిరిరాజు



**పామూరు,పెన్ పవర్, మార్చి 21 :** పట్టణంలోని సర్వే నెంబర్ 398/2లో గల 63 సెంట్లు శ్రీ మదన వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన భూమి పేరం రఘునాథరెడ్డి, పేరం బైరెడ్డి, పేరం రామిరెడ్డిల పేరుతో పొరపాటున నమోదు కావడం జరిగింది. సదరు విషయాన్ని పేరం సోదరులకు ఈవో శ్రీ గిరిరాజు నరసింహ బాబు తెలియజేయగా అందుకు వారు సమ్మతించి 63 సెంట్ల ఆలయ భూమిని తిరిగి ఆలయానికి చెందేటట్లు ఒప్పంద పత్రం రాసి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గిరిరాజు పేరం సోదరులను అభినందించి శ్రీ మదన వేణుగోపాల స్వామి కరుణాకటాక్షాలు పేరం సోదరులపై ఉంటాయని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కొండిశెట్టి రమణయ్య, కావిటి వెంకటసుబ్బయ్య, సిద్ధవటం నరసింహారావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ఎర్ర చందనం దుంగలు స్వాధీనం




**కాళహస్తి , మార్చి 21 పెన్ పవర్ ప్రతినిధి :** శ్రీ కాళహస్తి మేలచూరు గ్రామంలో 131 కిలోల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాళహస్తి అటవీశాఖ రేంజ్ అధికారి లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మేలచూరు గ్రామంలోని మామిడి తోటలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా ముగ్గురు పరారయ్యారన్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షల ఉంటుందని వెల్లడించారు.

## బ్యాట్ పట్టిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే




**శ్రీకాళహస్తి, మార్చి 21 పెన్ పవర్ ప్రతినిధి :** శాసన సభ్యుల క్రీడా పోటీలలో భాగంగా నిన్న జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఎమ్మెల్యేతో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కం ఠభరితంగా సాగింది. ఈ పోటీల్లో ఆయన బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్‌పై అవగాహన



**శ్రీ కాళహస్తి, మార్చి 21 పెన్ పవర్ ప్రతినిధి :** శ్రీకాళహస్తిలోని రామసేతు వంతెన వద్ద ఆటో డ్రైవర్లకు డిఎస్పి నరసింహమూర్తి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటో ఆపకూడదన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు దించినప్పుడు రోడ్లకు పూర్తిగా పక్కకు ఆపాలని సూచించారు. పరిమితికి మించి ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించకూడదని హెచ్చరించారు. సీఐ గోపి పాల్గొన్నారు.

## మాజీ జెడ్పిటిసి మొరబోయిన హుస్సేన్ రావు నివాళులర్పించిన ముస్లిం మైనార్టీ నాయకులు



**పాముర్, పెన్ పవర్, మార్చి21 :** మాజీ జడ్పిటిసి టిడిపి సీనియర్ నాయకులు మొరబోయిన హుస్సేన్ రావు యాదవ్ నిన్న మధ్యాహ్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. మొరబోయిన హుస్సేన్ రావు యాదవ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన ముస్లిం మైనార్టీ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొరబోయిన హుస్సేన్ రావు యాదవ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొందుటకు కీలక పాత్ర పోషించాడు. పార్టీలో ఆయన సేవలో మరువురాణి అని వారు అన్నారు. అనంతరం మొరబోయిన హుస్సేన్ రావు యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో షేక్ హాజీ గౌస్ , షేక్ గౌస్ బాషా, షేక్ ఖజా రహమతుల్లా, ఖాదర్ బాషా తదితరులు నివాళులర్పించారు.

## లక్ష్యం మేరకు నీటి కుంటల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, మార్చి 21: పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ :** ఈనెల 22న ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు నీటి కుంటల పనులను ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుండి ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి.రాజకమారి, డిఆర్ఓ రాము నాయక్, డ్వామా పిడి వెంకటసుబ్బయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అడవులు, చెట్లు లేకుంటే మానవ జాతి మనుగడే లేదు

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**కడప పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21 :** ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అడవుల,చెట్ల ప్రాముఖ్యతను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పడమే ఈ రోజు ఉద్దేశం అని తులసి రెడ్డి అన్నారు. అడవులు, చెట్లు లేకపోతే మానవ జాతి మనుగడే లేదన్నారు. చెట్లు మనిషికి అవసరమైన ప్రాణవాయువును ఉత్పత్తి చేస్తాయి. అదే సమయంలో మనుష్యులు వదిలే బొగ్గు పులుసు వాయువును గ్రహిస్తాయి. చెట్లు ఉత్పత్తి చేసే ఆక్సిజన్ ఓజోన్ పొరగా ఏర్పడి సూర్య రష్మిలో వున్న నేల లోహిత కిరణాల నుండి మనిషిని కాపాడుతాయి. అడవులు మానవునికి కాయలు, పండ్లు, విత్తనాలు, కలప, వెదురు, బంక, పూలు, ఔషధాలు ఇస్తాయి. భారతీయ నారికత అంతా అడవుల్లోనే పుట్టింది. ఋషులు, మునులు అడవుల్లో తపస్సు చేసి జ్ఞానాన్ని సముపార్జించి భవిష్యత్ తరాలకు అందించారు. త్రేతా యుగంలో సీతా రామ లక్ష్మణులు 14 ఏళ్లు, ద్వాపర యుగంలో పాడవులు 12 ఏళ్లు అడవుల్లో జీవించారు. మొత్తం భూ భాగంలో 33 శాతం అడవులు వుండాలి. కానీ మన దేశంలో కేవలం 19 శాతం మాత్రమే అడవులు ఉన్నాయి. కాబట్టి అడవుల విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వున్న చెట్లను కాపాడుకోవడం అంతకంటే ముఖ్యం. అశోకుడు చెట్లు నాటెను - జగన్ చెట్లు నరికెను అన్న రీతిలో వైకాపా పాలన సాగింది. భద్రతా కారణాలు చూపి గతం లో జగన్ పర్యటన సందర్భంగా అధికారులు చెట్లను నరికే వారు. ఈ దుష్ట సాంప్రదాయాన్ని కొనసాగించ వద్దని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. మొక్కలు నాటే కార్యక్రమం, చెట్లను రక్షించే కార్యక్రమం పవిత్ర కార్యక్రమంగా భావించాలని కాంగ్రెస్ శ్రేణులకు తులసి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజక వర్గం సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి,మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామ కృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, ఉత్తన్న, బద్రి, సాయి, విజయ్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాతృ దేవోభవ.. తల్లిని మించిన దైవం లేదు..

### - రాచ మోహన్ శ్రీరామచంద్ర మిషన్ కడప



**కడప పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21 :** వీరబలుడు అనే యువకుడు మాతృ రుణం తీర్చుకోవాలని లక్ష బంగారు నాణాల సంచిని తల్లికి ఇస్తూ... "అమ్మా! ఈ నాణాలను తీసుకుని నీకు ఇష్టమైన విధంగా ఉపయోగించుకో. దానితో నీ రుణం నుండి నాకు విముక్తి లభిస్తుంది" అన్నాడు.

తల్లి నవ్వి ఊరుకుంది.... కానీ, వీరబలుడు అదే మాటను మళ్ళీ మళ్ళీ చెప్పడంతో.......ఆ తల్లి..... "బిడ్డా.. నా రుణం తీర్చుకోవాలీ అనుకుంటే ఈ డబ్బు నాకు అవసరం లేదు.ఒకరోజు రాత్రిపూట నా వద్ద పడుకో చాలు" అంది. వీరబలుడు సరే అని ఆ రోజు తల్లి మంచం మీద ఆమె పక్కనే పడుకున్నాడు. అతనికి నిద్ర రాగానే తల్లి లేపి "నాయనా, దప్పికవుతోంది కాసిన్ని నీళ్ళు తాగించు" అంది. వీరబలుడు సంతోషంగా లేచి గ్లాసుతో నీళ్ళిచ్చాడు. రెండు గుటకలు వేసి గ్లాసును జారవిడిచింది. నీళ్ళుపడి పక్క తడిసిపోవడం చూసి "ఏమిటమ్మా ఇది" అన్నాడు. "పొరపాటు జారిపోయింది నాయనా" అంది తల్లి. వీరబలుడు మౌనంగా పడుకున్నాడు. అతడికి కాస్త నిద్రపట్టగానే తల్లి మళ్ళీ లేపి "బిడ్డా! దప్పిక అవుతోంది నీళ్ళు ఇవ్వు" అంది. "ఇప్పుడే కదా నీళ్ళు తాగావు, ఇంతలోనే మళ్ళీ దప్పిక అయిందా... ? పత్తి గింజలు ఏమైనా తిన్నావా?" అంటూ చిరాగ్గా లేచి నీళ్ళు ఇచ్చాడు. మళ్ళీ తల్లి మొదటి మాదిరిగానే ఒకటి రెండు గుటకలు వేసి నీటిని పక్కమీద ఒలకబోసింది. వీరబలుడు కోపంతో "అమ్మా, ఏమిటిది, పక్కంతా తడిపేశావు... కళ్ళు కనిపించట్లేదా" అన్నాడు.

"నాయనా! చీకటిగా ఉండటంతో గ్లాసు చేతినుండి జారిపోయింది" అని చెప్పింది తల్లి. అది విని కోపాన్ని తమాయించుకున్న వీరబలుడు మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు. అంతలో తల్లి మళ్ళీ లేపి మంచినీళ్ళు అడగడంతో వీరబలుడు కోపం పట్టలేకపోయాడు. "అమ్మా! ఏమిటి... దప్పిక దప్పిక అని నా దుంప తెంచుతున్నావు. నన్ను అసలు నిద్రపోనిస్తావా లేదా" అంటూ నీళ్ళు తీసుకువచ్చి "ఇదిగో తాగి చావు" అన్నాడు. తల్లి ఎప్పటిలాగానే ఓ గుక్క తాగి మిగిలిన నీళ్ళతో పక్కను తడిపేసింది.వీరబలి ఇక సహించలేక .. "బుద్ధుందా లేదా... ఇలా వేధించడానికేనా నన్ను నీ మంచం మీద పడుకోమన్నావు? ఈ తడిబట్టల మీద ఎట్లా పడుకోవాలి? చూడబోతే నీకు మతి పూర్తిగా పోయినట్లు ఉంది. అందుకే ఇలా చంపుకు తింటున్నావు" అంటూ ఆగ్రహంతో కేకలేశాడు. అప్పుడు తల్లి "వీరా! చాలించు. అరుపులు ఆపు. నా రుణం తీర్చుకుంటానన్నావు, తల్లి రుణం తీర్చుకోగలుగుతావా?

నీ తలమీద ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్ని జన్మలెత్తి, నిరంతర సేవ చేసినా మాతృ రుణం నుండి విముక్తుడవు కాలేవు. "ఎందుకంటావా"... ?

"నువ్వు పసిబిడ్డగా ఉన్నప్పుడు రోజూ పక్కమీదే మల మూత్రాదులు చేసేవాడివి. నీ తడిసిపోయిన బట్టలు విప్పేసి, నా కొంగుతో నిన్ను కప్పేదాన్ని." "పక్కబట్టలను నువ్వు తడిపిన వైపు నేను పడుకుని నిన్ను పొడిగా ఉన్నవైపు పడుకోబెట్టి నిద్రబుచ్చేదాన్ని. ఇలా ఒకరోజు కాదు, ఒక వారం కాదు, కొన్ని సంవత్సరాలపాటు.. "నీ అంతట నువ్వు వేరే పడుకోగలిగే వరకూ నేను ప్రతిరోజూ అలానే ఎంతో ప్రేమతో చేస్తూ ఉండేదాన్ని. కానీ నువ్వు ఒకటి రెండుసార్లు నీళ్ళతో పక్క తడిపినందుకే కోపం వచ్చి విసుక్కుంటున్నావు, ఒక్క రాత్రికే వీరంగం వేస్తున్నావు" అంది తల్లి. వీరబలుడు సిగ్గుపడి తల్లి పాదాలు పట్టుకుని.... "అమ్మా! నా కళ్ళు తెరుచుకున్నాయి. బిడ్డలను కని పెంచే క్రమంలో తల్లి పడే శ్రమకూ కష్టానికీ సహనానికీ బదులు తీర్చుకోవడమన్నది ఎన్ని వందల సంవత్సరాలు సేవలు చేసినా జరిగే పని కాదు. నీ రుణం చెల్లించడం అసంభవం. నేనే కాదు, లోకంలో ఎవరూ కూడా తల్లి రుణం తీర్చుకోలేరు" అన్నాడు... నిజమే కదా తల్లి పాలు ఒక్కపూట త్రాగిన ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము. ఇదే మనకు వేదము, గురు చరిత్ర తెలిపిన సత్యం.

### వల్లూరు యువత ఆధ్వర్యంలో

## చలివేంద్రం ఏర్పాటు

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ కమలాపురం, మార్చ్ 21 :** వేసవికాలంలో ప్రజలకు చల్లని త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో వల్లూరు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన యువత నడుం బిగించి స్వచ్ఛందంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం కొప్పోలు బస్టాండ్ వద్ద చలివేంద్రం ప్రారంభించారు. స్వచ్ఛందంగా యువత సేవా కార్యక్రమంలో పాల్గొనడంతో స్థానికులు అభినందించారు.



## కాశిరెడ్డి నాయన ఆశ్రమ క్షేత్రాన్ని దర్శించిన ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం









**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ మార్చ్ 21 :** ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు కాశీరెడ్డి నాయన ఆశ్రమం సందర్శించి అక్కడ కూల్చి వేసిన కట్టడాలను పరిశీలించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రధాకార్యదర్శి తమ్మినేని గోపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్ర రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సుహాసిని రెడ్డి, కో-ఆర్డినేటర్ గజ్జల లక్ష్మి రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బిక్క నరసింహారెడ్డి ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి సహాయ కార్యదర్శి అన్నెం సుబ్బారెడ్డి అనంతపూర్ జిల్లా అధ్యక్షుడు పాటిల్ రామకృష్ణారెడ్డి, ఆత్మకూరు రామ కృష్ణ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి దామోదర్ రెడ్డి, జ్ఞానందర్ రెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు యల్. విజయ భాస్కర్ రెడ్డి, హనుమంతు రెడ్డి, అన్నపురెడ్డి విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి వణుకూరు రమణారెడ్డి భవిష్యత్తులో ఇటువంటి బాధాకరమైనటు వంటి, సంఘటనలు జరగకుండా చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం అనేక సేవా కార్యక్రమాలు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో నిత్యం జరిగే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మహిళా విభాగం అధ్యక్షురాలు సుహాసిని రెడ్డి, కడప రెడ్డి సంఘం అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నిత్య అన్నదాన కార్యక్రమాలకు శ్రీకారం చూడదామని రైతులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంఘం నాయకులు, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

